వనం..మనం.. మనఊరి కోసం
RNI/APTEL/26/A3829
ప్రభ
# మనం
TELUGU DAILY
తెలుగు డైలీ
Gmail: prabhamanam@gmail.com

విలేకరులు కావలెను.
WANTED... WANTED...
ఆంధ్ర, తెలంగాణ నుండి
వెలువడుతున్న తెలుగు జాతీయ దినపత్రిక
ప్రభ మనం తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు,
ఆర్సీ ఇంచార్జీలు, సిసి ఇంచార్జీలు మరియు మండల
విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.

ఎడిటర్: వి. లింగమూర్తి
9000367833, 8074937223

కర్నూలు : ఎడిటర్ - వడ్డే లింగమూర్తి | సంపుటి : 1 సంచిక : 43 పేజీలు : 4 వెల రూ./-4 | email: prabhamanam@gmail.com బుధవారం 01-07-2026

## పీఓకేలో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా తీవ్ర నిరసన

**భారత్‌తో కలుస్తామని హెచ్చరిక**

- పీఓకేలోని రావల్ కోట్‌లో 22 రోజులుగా భారీ నిరసనలు
- పాకిస్థాన్‌లో మేం భాగం కాదంటున్న ఆందోళనకారులు
- ఆహార దిగ్బంధనం కొనసాగితే భారత్ వైపు చూస్తామన్న హెచ్చరిక
- నిరసనలను అణచివేసేందుకు ఇంటర్నెట్ సేవలు బంద్
- విదేశాల్లోని కశ్మీరీల నుంచి కూడా ఆందోళనలకు మద్దతు



పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తీవ్రరూపం దాల్చాయి. రావల్ కోట్‌లోని ఈద్గా మైదానంలో గత 22 రోజులుగా వేలాది మంది ప్రజలు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. పీఓకే - మిగతా 2 లో

## నేను కళ్లు మూసుకుని ఇండియానే కొంటా

**దేశాలు గనుక స్టాక్స్ అయితే**

- ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్‌పై స్టీవ్ డైన్స్ ప్రశంస
- అయితే ఇరుదేశాల సంబంధాలు 30 ఏళ్ల కనిష్ఠానికి పడిపోయాయన్న డెమోక్రాట్ నేత రో ఖన్నా
- ట్రంప్ ప్రభుత్వ చర్యలకు, సెనెటర్ ప్రశంసలకు మధ్య కనిపిస్తున్న వైరుధ్యాలు
- ప్రధాని మోదీతో సంబంధాలను ట్రంప్ బలోపేతం చేస్తున్నారని డైన్స్ వెల్లడి



"దేశాలను స్టాక్ మార్కెట్లో షేర్లలా చూస్తే, తాను కచ్చితంగా భారత్ షేరునే కొనుగోలు చేస్తాను" అంటూ అమెరికాకు చెందిన రిపబ్లికన్ సెనెటర్ స్టీవ్ డైన్స్ భారత్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో భారత్ వేగంగా ఎదుగుతోందని, అమెరికాతో ఆ దేశ సంబంధాలు అత్యంత కీలకమని ఆయన - మిగతా 2 లో

## డిగ్రీలు కాదు ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చేదే నిజమైన విద్య




- విశాఖలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవంలో పాల్గొన్న లోకేశ్
- అన్ని వర్గాల అభివృద్ధితోనే వికసిత్ భారత్ సాకారం అవుతుందని వ్యాఖ్య
- విద్యార్థులను భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దుతామని స్పష్టం
- కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్

ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే అసలైన విద్య అని, కేవలం డిగ్రీలు - మిగతా 2 లో

# ఖనిజ సంపదపై చంద్రబాబు మాస్టర్ ప్లాన్

**ఆదాయం పెంపే లక్ష్యంగా కీలక ఆదేశాలు**

- రాష్ట్రంలో ఖనిజ నిల్వల గుర్తింపునకు మినరల్ మ్యాపింగ్ చేయాలని సీఎం ఆదేశం
- ఖనిజాలకు రాష్ట్రంలోనే విలువ జోడింపు ద్వారా ఆదాయం పెంచడంపై ప్రత్యేక దృష్టి
- అరుదైన ఖనిజాల వెలికితీతకు క్లస్టర్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచన
- టెక్నాలజీ వినియోగంతో ఉచిత ఇసుక సరఫరాను పటిష్టంగా పర్యవేక్షించాలని స్పష్టం




రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అపారమైన ఖనిజ సంపదను సద్వినియోగం చేసుకుని, ప్రభుత్వ ఆదాయాన్ని గణనీయంగా పెంచుకోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందులో

## రెండేళ్ల కాలంలో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం



- ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టుల విలువ రూ. 11.77 లక్షల కోట్లుగా ఉందన్న భరత్
- ఈ ప్రాజెక్టుల వల్ల దాదాపు 10.32 లక్షల ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడి
- యువతను పారిశ్రామికవేత్తలుగా మార్చడం ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి

ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే పారిశ్రామిక అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం - మిగతా 2 లో

# వర్షం రాలేదాయే రైతన్నలకు చింతలాయే

- తడవని మడి.. కంటతడి
- వర్షం కోసం వేయికళ్లతో రైతన్నలు ఎదురుచూపులు
- ఎల్‌నినో ప్రభావంతో నైరుతి రుతుపవనాలు ఆలస్యం...
- పలు జిల్లాల్లో లోటు వర్షపాతం..




కర్నూలు బ్యూరో, జూన్,30,ప్రభ మనం: సరైన సమయానికి వర్షాలు కురవకపోవడం మరియు రుతుపవనాల ఆలస్యం కారణంగా రైతన్నలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. భూముల్లో తేమ లేకపోవడంతో విత్తనాలు మొలకెత్తక,

## అమర్‌నాథ్ యాత్రకు ఉగ్రముప్పు కేంద్రం హై అలర్ట్!



- అమర్‌నాథ్ యాత్రపై నిఘా సంస్థల సమాచారంతో అప్రమత్తత
- యాత్ర మార్గంలో కట్టుదిట్టమైన భద్రత
- ఏఐ కెమెరాలు, డిజిటల్ స్కానింగ్ ఏర్పాటు
- జమ్ముకశ్మీర్‌లో కొనసాగుతున్న గాలింపు చర్యలు
- యాత్రికులు అధికారిక సూచనలు పాటించాలని విజ్ఞప్తి
- జులై 3 నుంచి అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

జులై 3న ప్రారంభం కానున్న అమర్‌నాథ్ యాత్ర నేపథ్యంలో భద్రతా వ్యవస్థను మరింత - మిగతా 2 లో

## మంత్రి శ్రీధర్ బాబు దంపతుల మార్ఫింగ్ వీడియో



- శ్రీధర్ బాబు, ఆయన భార్య శైలజా రామయ్యర్ ఫేక్ వీడియోను పోస్ట్ చేసిన గుర్తు తెలియని వ్యక్తులు
- సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన న్యాయవాది శశిభూషణ్
- నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఆయన భార్య, - మిగతా 2 లో

## ప్రజాప్రతినిధుల కోర్టులో బండి సంజయ్ కి ఊరట

- హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో బండి సంజయ్‌పై కేసు నమోదు
- అధికార బీఆర్ఎస్ పార్టీ ఓటుకు రూ.25 వేలు పంచుతోందని ఆరోపించిన సంజయ్
- ఈ వ్యాఖ్యలపై కేసు నమోదు చేసిన హుజూరాబాద్ పోలీసులు



హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో నమోదైన ఒక పాత కేసులో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు నుంచి పెద్ద ఊరట లభించింది. సుదీర్ఘ విచారణ అనంతరం ఆయనపై నమోదైన కేసును న్యాయస్థానం పూర్తిగా కొట్టివేసింది. అసలు విషయానికి వస్తే. - మిగతా 2 లో

## మృతి చెందిన కార్మికుల కుటుంబాలను మోసం చేయవద్దని వ్యాఖ్య

- తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో 2025 జూన్ 30వ తేదీ ఒక చీకటి రోజు
- సిగాచి పరిశ్రమలో 54 మంది కార్మికులు సజీవదహనమైన ఘటనను గుర్తు చేసుకున్న హరీశ్
- 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నా రేవంత్ రెడ్డి రాలేదని విమర్శ



తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో 2025 జూన్ 30వ తేదీ ఒక చీకటి రోజు అని మాజీ బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఆవేదన వ్యక్తం - మిగతా 2 లో

# ఎల్లుండి తెలంగాణ కేబినెట్ అత్యవసర భేటీ

- ఎల్లుండి మధ్యాహ్నం 3 గంటలకు రేవంత్ అధ్యక్షతన కేబినెట్ భేటీ
- ఈరోజు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిన చీఫ్ సెక్రటరీ
- ఉన్నతాధికారులంతా కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశం




తెలంగాణ రాష్ట్ర కేబినెట్ అత్యవసరంగా భేటీ కానుంది. జులై 2వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ కీలక సమావేశం

మనం TELUGU DAILY RNI/APTEL/26/A3829 Gmail: prabhamanam@gmail.com
బుధవారం 01-07-2026

# రెండేళ్ల కాలంలో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం

మొదటి పేజీ తరువాయి – అత్యంత వేగంగా అడుగులు వేస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. గత రెండేళ్ల కాలంలోనే రాష్ట్రం సుమారు రూ.20 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడంలో విజయవంతమైందని, ఇందులో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ఆమోదించిన ప్రాజెక్టుల విలువ రూ.11.77 లక్షల కోట్లుగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో దాదాపు 10.32 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా మొత్తం పెట్టుబడుల్లో ఏపీ వాటా 24.3 శాతానికి చేరుకుందని, పారిశ్రామిక అనుమతులను వేగంగా ఇస్తూ రాష్ట్రం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని మంత్రి వివరించారు. రాష్ట్ర భవిష్యత్తును మార్చేలా క్వాంటం వ్యాలీ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ, స్పేస్ అండ్ డ్రోన్ సిటీ, స్టీల్ ప్లాంట్లు వంటి అత్యాధునిక రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. యువతను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం 'ఒక కుటుంబం -- ఒక పారిశ్రామికవేత్త' అనే వినూత్న విధానాన్ని తీసుకొచ్చిందని మంత్రి చెప్పారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువతలోని సరికొత్త ఆలోచనలను, ప్రతిభను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. శ్రీహరికోటను కేంద్రంగా చేసుకుని స్పేస్ సిటీతో పాటు స్పేస్ టూరిజాన్ని కూడా ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా రూ.500 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న 'భవ్య' పార్కుల్లో కనీసం 3 నుంచి 4 పార్కులను ఏపీకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని... ఎయిర్‌స్పేస్, డిఫెన్స్ రంగాల్లో రూ.10 వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టేందుకు పలు అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయని వెల్లడించారు.

# ప్రజాప్రతినిధుల కోర్టులో బండి సంజయ్ కి ఊరట

మొదటి పేజీ తరువాయి – హుజూరాబాద్ ఉప ఎన్నిక ప్రచార సమయంలో అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీపై బండి సంజయ్ తీవ్ర ఆరోపణలు చేశారు. అధికార పార్టీ ఓటుకు ఏకంగా రూ.25 వేల వరకు పంచుతోందని, అందులో ఓటర్లకు కేవలం రూ.5 వేలు ఇచ్చి మిగిలిన మొత్తాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలే నొక్కేస్తున్నారంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ విమర్శలపై అప్పట్లో తీవ్ర రాజకీయ దుమారం రేగింది. ఈ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్న హుజూరాబాద్ పోలీసులు.. బండి సంజయ్‌పై పలు కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అయితే, తాజాగా ఈ వ్యవహారాన్ని పరిశీలించిన ప్రత్యేక కోర్టు.. ఆయనపై మోపిన ఆరోపణలకు సరైన ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.

# తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో 2025 జూన్ 30వ తేదీ ఒక చీకటి రోజు

మొదటి పేజీ తరువాయి – చేశారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచి పరిశ్రమలో కూలి కోసం వలస వచ్చిన 54 మంది పేద కార్మికులు సజీవదహనమైన ఘోర ఘటనకు ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ నియంత్రణ, పర్యవేక్షణ వైఫల్యం, సిగాచి యాజమాన్య నిర్లక్ష్యం కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోయారని విమర్శించారు. ఘటన జరిగిన రోజున హైదరాబాద్ జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో ఉన్నా 20 కి.మీ దూరంలోని ఘటన స్థలానికి సీఎం రేవంత్ రాకపోవడం, బాధిత కుటుంబాల కన్నీళ్లు తుడవకపోవడం హృదయవిదారకమన్నారు. విమర్శలు రావడంతో మరుసటి రోజు వచ్చారని విమర్శించారు. రేవంత్ రెడ్డి మృతదేహాల సాక్షిగా ప్రతి కుటుంబానికి రూ.1 కోటి ఇస్తానని ప్రకటించినా, ప్రభుత్వం తరపున కేవలం రూ.1 లక్ష మాత్రమే ఇచ్చింది. కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్సూరెన్స్, వైద్య ఖర్చులను కూడా పరిహారంలో చేర్చి మోసం చేశారని ఆరోపించారు. డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పడం, ఉద్యోగాలు ఇవ్వకపోవడం, క్షతగాత్రులకు సహాయం చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఈ ఘటన సామూహిక హత్య అని, 818 ఎూకి అనుమతి తీసుకుని 1777 ఎూ నడపడం, సేఫ్టీ గార్డ్స్, ఫైర్ చీూజ, డస్ట్ కంట్రోల్ వ్యవస్థ లేకపోవడం వంటి నిర్లక్ష్యాలు విచారణలో తేలాయన్నారు. ప్రభుత్వం యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోవడం, ఎండీని అరెస్టు చేసి వెంటనే బెయిల్‌పై విడుదల చేయడం లోపాయికారీ ఒప్పందాన్ని సూచిస్తుందని విమర్శించారు. సిగాచి డైరెక్టర్ల ఆస్తులను అటాచ్ చేసి కోటి రూపాయల పరిహారం తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. "మాట తప్పడం మీకు అలవాటే కానీ, ప్రాణాలు కోల్పోయిన పేద కార్మికుల కుటుంబాలను మోసం చేయవద్దు" అని హరీశ్ రావు వ్యాఖ్యానించారు.

# మంత్రి శ్రీధర్ బాబు దంపతుల మార్ఫింగ్ వీడియో

మొదటి పేజీ తరువాయి – సీనియర్ ఐఏఎస్ అధికారిణి శైలజా రామయ్యర్ దంపతులను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఒక మార్ఫింగ్ వీడియో కలకలం రేపుతోంది. వారిద్దరిపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (డీప్ ఫేక్)తో క్రియేట్ చేసిన అభ్యంతరకర మార్ఫింగ్ వీడియో ఫేస్‌బుక్‌లో ప్రత్యక్షమవ్వడం దుమారం రేపుతోంది. శ్రీధర్ బాబు దంపతుల వ్యక్తిగత, వృత్తిపరమైన ఇమేజ్‌ను డ్యామేజ్ చేయాలనే పక్కా స్కెచ్‌తో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఫేస్‌బుక్‌లో ఈ అభ్యంతరకర మార్ఫింగ్ వీడియోలను పోస్టు చేశారు. ఈ వీడియోలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు న్యాయవాది శశిభూషణ్ ఫిర్యాదు చేశారు. సమాజంలో ఎంతో ఉన్నతమైన హోదాల్లో ఉన్న ఒక మంత్రి, ఒక ఐఏఎస్ అధికారిణి ప్రతిష్ఠను బజారున పడేసేలా ఈ ఫేక్ వీడియోలు ఉన్నాయంటూ తన ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు. ఈ తప్పుడు పోస్టులు పెట్టిన వ్యక్తులను గుర్తించి ఐటీ యాక్ట్ కింద కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# పీఓకేలో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా తీవ్ర నిరసన

మొదటి పేజీ తరువాయి – పాకిస్థాన్‌లో భాగం కాదని, ఇకపై ఇస్లామాబాద్ నియంత్రణలో తాము ఉండబోమని నిరసనకారులు స్పష్టం చేస్తున్నారు. ఈ ఆందోళనలో పాల్గొన్న పౌర హక్కుల కార్యకర్త సర్దార్ అమన్ ఖాన్ మాట్లాడుతూ పాకిస్థాన్ ప్రభుత్వానికి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. పాక్ ప్రభుత్వం ఆహారం, నిత్యావసరాలను అడ్డుకుంటే, తమ సరిహద్దులను భారత్ వైపు తెరుస్తామని ఆయన అన్నారు. అప్పుడు పీఓకేను తమతోనే ఉండమని ఇస్లామాబాదే వేడుకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. పాక్ ప్రభుత్వ అణచివేత, తీవ్రమైన ఆర్థిక కష్టాలు, ద్రవ్యోల్బణం, పాలనా వైఫల్యాలే ఈ నిరసనలకు ప్రధాన కారణాలని ఆందోళనకారులు తెలిపారు. సుమారు రెండు వారాలుగా ప్రభుత్వం ఆహార, సరఫరాల దిగ్బంధనం విధించడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరసనల సమాచారం బయటి ప్రపంచానికి తెలియకుండా ఉండేందుకు జూన్ 5 నుంచి ఈ ప్రాంతంలో ఇంటర్నెట్ సేవలను పూర్తిగా నిలిపివేశారు. మరోవైపు, నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) సమీపంలో కూడా జూన్ 9 నుంచి మరో నిరసన దీక్ష కొనసాగుతోంది. ఈ ఆందోళనలకు విదేశాల్లోని పాకిస్థానీ రాయబార కార్యాలయాల వద్ద కశ్మీరీల నుంచి కూడా మద్దతు లభిస్తోంది. ముజఫరాబాద్ సహా తమ ప్రాంతానికి సంబంధించిన రాజకీయ డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం ఆగదని నిరసనకారులు తేల్చిచెప్పారు.

# అమర్‌నాథ్ యాత్రకు ఉగ్రముప్పు.. కేంద్రం హై అలర్ట్!



మొదటి పేజీ తరువాయి – బలోపేతం చేశారు. యాత్రను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడులకు ప్రయత్నించే అవకాశం ఉందని భారత నిఘా సంస్థలు అప్రమత్తం చేసినట్లు సమాచారం. దీంతో యాత్ర మార్గమంతా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. నిఘా వర్గాల సమాచారం ప్రకారం.. పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తున్‌ఖ్వా, బలూచిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) ప్రాంతాల్లో కల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ భారత్‌లో అలజడి సృష్టించే ప్రయత్నాలు చేయవచ్చని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా అమర్‌నాథ్ యాత్రను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. నిఘా సంస్థలు గుర్తించిన సమాచారం ప్రకారం.. జమ్మూకశ్మీర్‌లో అడవుల్లో దాక్కున్న కొంతమంది ఉగ్రవాదులతో పాక్ మూకలు సంప్రదింపులు జరిపే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. పెద్దఎత్తున దాడులు జరిపేలా వారిని ప్రేరేపించే యత్నాలు జరుగుతున్నాయని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. ఈ హెచ్చరికల నేపథ్యంలో యాత్ర మార్గంలో భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించారు. ఉగ్రవాద వ్యతిరేక నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. అత్యాధునిక కృత్రిమ మేధ ఆధారిత కెమెరాలు, డిజిటల్ స్కానింగ్ వ్యవస్థలను కూడా ఏర్పాటు చేశారు. యాత్రికుల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఇదే సమయంలో జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఆపరేషన్‌లు కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. బలగాలు అప్రమత్తంగా ఉన్నప్పటికీ, యాత్రికులు అధికారిక సూచనలు పాటించాలని, వదంతులను నమ్మొద్దని భద్రతా వర్గాలు సూచిస్తున్నారు.

# డిగ్రీలు కాదు ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చేదే నిజమైన విద్య

మొదటి పేజీ తరువాయి – సంపాదించడం విద్యకు పరమార్థం కాదని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఉద్ఘాటించారు. నాణ్యమైన విద్య సమాజంలోని ప్రతి వర్గానికి, దేశంలోని ప్రతి మూలకు చేరినప్పుడే వికసిత్ భారత్ కల సాకారమవుతుందని ఆయన అన్నారు. మంగళవారం విశాఖపట్నంలోని నోవాటెల్ హోటల్‌లో జరిగిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) తొలి స్నాతకోత్సవంలో మంత్రి లోకేశ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. "ప్రతి తరం ఒక దేశాన్ని వారసత్వంగా స్వీకరిస్తుంది. కానీ ఆ దేశ భవిష్యత్తును నిర్ణయించేది విద్య మాత్రమే. విశ్వవిద్యాలయాలు కేవలం డిగ్రీలు అందించే సంస్థలు కావు. అవి కలలకు రూపమిస్తాయి, ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయి, నాయకులను తయారు చేస్తాయి. ఈ రోజు జరుగుతున్నది కేవలం ఒక స్నాతకోత్సవం కాదు, ఇది అవకాశాల, సమ్మిళిత అభివృద్ధి వేడుక" అని అభివర్ణించారు.

**అన్ని వర్గాల భాగస్వామ్యంతోనే సమగ్రాభివృద్ధి**

అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెంది, అన్ని వర్గాలు భాగస్వాములైనప్పుడే వికసిత్ భారత్ సాధ్యమని లోకేశ్ తెలిపారు. "గిరిజన ప్రాంతాల్లోని విశ్వవిద్యాలయాలు కేవలం విద్యా కేంద్రాలుగా కాకుండా, సామాజిక పరివర్తనకు మార్గదర్శకాలుగా నిలుస్తాయి. ఒక కుటుంబంలో తొలి తరం విద్యార్థి పట్టభద్రుడైతే, ఆ కుటుంబంతో పాటు దేశం కూడా పురోగమిస్తుంది. మన గిరిజన వారసత్వాన్ని కాపాడుకుంటూ, పరిశోధనలు, ఆవిష్కరణల ద్వారా ప్రతి పౌరుడికి సాధికారత కల్పించడమే వికసిత్ భారత్ స్ఫూర్తి" అని ఆయన వివరించారు.

**ఏఐ యుగంలో మానవ విలువల ప్రాధాన్యం**

ప్రస్తుత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యుగంలో మానవ విలువల ప్రాధాన్యతను లోకేశ్ నొక్కిచెప్పారు. "ఏఐ మనకు సమాధానాలు ఇవ్వగలదు, కానీ మానవీయ విలువలు, జిజ్ఞాస, కరుణ, వ్యక్తిత్వం వంటి లక్షణాలను ఎప్పటికీ భర్తీ చేయలేదు. ఈ విలువలు గొప్ప విశ్వవిద్యాలయాల్లోనే పెంపొందుతాయి. అందుకే వర్సిటీలు నైపుణ్యం ఉన్న వృత్తి నిపుణులతో పాటు బాధ్యతాయుతమైన పౌరులను, మానవతా దృక్పథం కలిగిన నాయకులను తయారు చేయాలి" అని ఆయన ఆకాంక్షించారు.

**భవిష్యత్ నాయకులను తయారు చేస్తాం**

ప్రధాని మోదీ కలలుగన్న వికసిత్ భారత్ నిర్మాణంలో నాణ్యమైన విద్య, ఆవిష్కరణలే కీలకమని లోకేశ్ అన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు అభినందనలు తెలుపుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏపీ ఉన్నత విద్యలో సమూల మార్పులు తీసుకువస్తున్నామని తెలిపారు. "మా లక్ష్యం డిగ్రీలు పొందిన విద్యార్థులను తయారు చేయడం కాదు, భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దడం. పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్యాలు, పరిశోధన, ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తూ భవిష్యత్ విశ్వవిద్యాలయాలను నిర్మిస్తున్నాం. ప్రతి విద్యార్థి ఉపాధికి అర్హుడు కావాలి, ప్రతి వర్సిటీ ఆవిష్కరణలకు కేంద్రంగా మారాలి" అని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, "డిగ్రీ మీకు వృత్తిని ఇస్తుంది, కానీ మీ వ్యక్తిత్వమే మీకు గౌరవాన్ని సంపాదిస్తుంది. సమాజానికి మీరు చేసే సేవే మీకు శాశ్వత వారసత్వాన్ని అందిస్తుంది" అని హితవు పలికారు. అంతకుముందు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బంగారు పతకాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, వర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ మదన్ లాల్ మీనా, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టీ.శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

# ఖనిజ సంపదపై చంద్రబాబు మాస్టర్ ప్లాన్

మొదటి పేజీ తరువాయి – భాగంగా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఖనిజ నిక్షేపాలను గుర్తించేందుకు సమగ్రమైన 'మినరల్ మ్యాపింగ్' చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కేవలం ముడి ఖనిజాలను వెలికితీయడమే కాకుండా, వాటికి రాష్ట్రంలోనే విలువ జోడించే (వాల్యూ యాడిషన్) ప్రక్రియలను ప్రోత్సహించడం ద్వారా గరిష్ఠ ప్రయోజనం పొందాలని స్పష్టం చేశారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "దేశంలోని కొన్ని రాష్ట్రాలు కేవలం ఖనిజాల ద్వారా వచ్చే ఆదాయంతోనే రెవెన్యూ మిగులు సాధిస్తున్నాయి. మన రాష్ట్రంలోనూ ఖనిజ సంపదకు మార్కెట్ క్యాపిటలైజేషన్ ద్వారా విస్తృత అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఏపీఎండీసీ ద్వారా ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలి. దీనిపై నిపుణులతో అధ్యయనం చేయించి, ఒక పటిష్టమైన విధానాన్ని రూపొందించాలి" అని అన్నారు. బీచ్ శాండ్, రేర్ ఎర్త్ మినరల్స్, ముడి ఇనుము, మాంగనీస్, అల్యూమినా వంటి ఖనిజాలకు ఇక్కడే విలువ జోడింపు ప్రక్రియలు జరిగేలా చూడాలని దిశానిర్దేశం చేశారు.

**అరుదైన ఖనిజాలపై ప్రత్యేక దృష్టి**

ఎలక్ట్రానిక్స్, మాగ్నెట్స్, అణు ఇంధనం వంటి వ్యూహాత్మక రంగాల్లో కీలకంగా ఉపయోగపడే అరుదైన భూ ఖనిజాల (రేర్ ఎర్త్ మినరల్స్)పై సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఏపీ, ఒడిశా, కేరళ రాష్ట్రాల్లో లభ్యమయ్యే ఈ ఖనిజాల కోసం ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. టైటానియం, ఇలమనైట్, మోనజైట్ వంటి అత్యంత విలువైన ఖనిజాల నిల్వలను కచ్చితంగా అంచనా వేయాలన్నారు. అలాగే, రాష్ట్రంలోని జొన్నగిరి, చిత్తూరు జిల్లా చిగురుగుంట ప్రాంతాల్లో ఉన్న బంగారం నిల్వలపై మరింత లోతుగా అధ్యయనం చేసి, ఇతర బ్లాకుల్లోనూ అన్వేషణ జరపాలని గనుల శాఖకు సూచించారు. రాష్ట్రంలో మొత్తం 126 ప్రాంతాల్లో క్రిటికల్, బల్క్, ఇతర విలువైన ఖనిజాలను గుర్తించినట్లు అధికారులు ఈ సమావేశంలో సీఎంకు వివరించారు.

**టెక్నాలజీతో ఇసుక పర్యవేక్షణ**

ప్రజలకు ఉచితంగా అందిస్తున్న ఇసుక విధానంలో పారదర్శకతకు, అక్రమాలకు తావులేకుండా చూడటానికి టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. "ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వం సుమారు రూ.1000 కోట్ల ఆదాయాన్ని వదులుకుని ఇసుకను ఉచితంగా అందిస్తోంది. ఇది దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే" అని స్పష్టం చేశారు. ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు, శాటిలైట్ చిత్రాల ద్వారా నిరంతర నిఘా, ఇసుక రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గనుల తవ్వకాలను కట్టుదిట్టంగా నిర్వహించడం ద్వారా రాష్ట్రానికి గరిష్ఠ ఆదాయం సమకూరేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, గనుల శాఖ ముఖ్యకార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నేను కళ్లు మూసుకుని ఇండియానే కొంటా

మొదటి పేజీ తరువాయి – అభిప్రాయపడ్డారు. 'ఎన్డీటీవీ' కథనం ప్రకారం.. వాషింగ్టన్ డీసీలో జరుగుతున్న యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ (యూఎస్ఐఎస్‌పీఎఫ్) సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పార్టీ అయిన రిపబ్లికన్ పార్టీ సెనేట్ ఎన్నికల ప్రచార విభాగానికి స్టీవ్ డైన్స్ అధిపతిగా ఉన్నారు. దీంతో ఆయన ట్రంప్ పార్టీ నాయకత్వానికి అత్యంత సన్నిహితుడిగా, రాజకీయంగా కీలక వ్యక్తిగా గుర్తింపు పొందారు. భారత్ ఆర్థిక వృద్ధిని ఉటంకిస్తూ ఆయన తన ప్రశంసలకు కారణాలను వివరించారు. "జీడీపీ దృష్ట్యా చూస్తే ప్రపంచంలోని టాప్ 20 ఆర్థిక వ్యవస్థలలో భారత్ ఐదో స్థానంలో ఉంది. త్వరలోనే జపాన్‌ను అధిగమించి నాలుగో స్థానానికి చేరుకోనుంది. అంతేకాదు, ఈ టాప్ 20 దేశాలలో ఈ ఏడాది, వచ్చే ఏడాది కూడా అత్యధిక జీడీపీ వృద్ధి రేటును నమోదు చేయబోయేది భారతే. అందుకే భారత్ ఎదుగుదల స్పష్టంగా కనిపిస్తోంది" అని డైన్స్ పేర్కొన్నారు. అయితే, ఇదే సదస్సులో మరో సందర్భంలో మాట్లాడిన డెమోక్రాటిక్ పార్టీకి చెందిన భారత సంతతి నేత రో ఖన్నా మాత్రం ఇందుకు పూర్తి భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత 30 ఏళ్లలో భారత్-అమెరికా సంబంధాలు అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయాయని ఆయన ఆరోపించారు. "ఇరాన్‌తో యుద్ధానికి దిగాలన్న ట్రంప్ విధానాలు పూర్తిగా విధ్వంసకరమైనవి. ఆ ప్రభావంతో భారత్‌లో గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. నమ్మకం లేకపోతే భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌ను అడగండి" అని 'ఏఎన్ఐ'ని ఉటంకిస్తూ రో ఖన్నా అన్నారు. ఒకవైపు డైన్స్ భారత్‌ను నమ్మకమైన భాగస్వామి అని, ప్రధాని నరేంద్ర మోదీతో సంబంధాలను బలోపేతం చేయడానికి ట్రంప్ కట్టుబడి ఉన్నారని చెబుతున్నప్పటికీ, ట్రంప్ ప్రభుత్వ చర్యలు మాత్రం అందుకు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. గత ఏడాది భారత్ నుంచి దిగుమతయ్యే వస్తువులపై ట్రంప్ ప్రభుత్వం 50 శాతం వరకు సుంకాలు విధించింది. ఈ సుంకాల వల్ల 2025 ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధికి ఒక శాతం వరకు గండి పడవచ్చని ఆర్థికవేత్తలు అప్పట్లో అంచనా వేశారు. ప్రస్తుతం ఈ సుంకాలు 18 శాతానికి తగ్గినా, ఇతర ఆసియా దేశాలతో పోలిస్తే ఇది ఇంకా ఎక్కువే. అదేవిధంగా అమెరికాకు భారతీయ విద్యార్థులు, నైపుణ్యం ఉన్న ఉద్యోగులు అవసరమని డైన్స్ చెబుతున్నప్పటికీ, ట్రంప్ ప్రభుత్వం మాత్రం విద్యార్థి వీసాలు, హెచ్-1బీ వర్క్ పర్మిట్లపై కఠిన నిబంధనలు విధించింది. ఫారిన్ స్టూడెంట్స్ కోసం ఉద్దేశించిన ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ)ను తొలగించడం, హెచ్-1బీ వీసా దరఖాస్తు రుసుమును ఒక లక్ష డాలర్లకు పెంచడం వంటి చర్యలు భారత విద్యార్థులు, నిపుణులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. భారతీయ అమెరికన్లపై పెరుగుతున్న ద్వేషపూరిత దాడుల గురించి ప్రశ్నించగా, "ద్వేషం ఏ రూపంలో ఉన్నా దానిని ఎదుర్కోవాలి. ఇక్కడ భారతీయ అమెరికన్లు చాలా సురక్షితంగానే ఉన్నారు" అని డైన్స్ సమాధానమిచ్చారు. అయితే, ఎఫ్‌బీఐ డేటాను విశ్లేషిస్తూ ఈ ఏడాది ఏప్రిల్‌లో యాక్సియోస్ ప్రచురించిన నివేదిక ప్రకారం, 2015 నుంచి 2025 మధ్య ఆసియన్లపై ద్వేషపూరిత నేరాలు 195 శాతం పెరిగాయని తేలింది. ఈ నేపథ్యంలో సెనేటర్ వ్యాఖ్యలు, క్షేత్రస్థాయి వాస్తవాల మధ్య వైరుధ్యం స్పష్టంగా కనిపిస్తోంది.

# వర్షం రాలేదాయే రైతన్నలకు చింతలాయే



ఇప్పటికే వేసిన పంటలు ఎండిపోయే దశకు చేరుకోవడంతో అన్నదాతలు చింతల్లో పడ్డారు.

వర్షాభావ పరిస్థితుల వివరాలు రుతుపవనాల మందగమనం

దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదవుతుండటంతో కరీఫ్ సీజన్ సాగు పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది పత్తి, వేరుశనగ రైతుల ఆందోళన: మృగశిర కార్తెలో పడిన చిరుజల్లులకు విత్తనాలు వేసిన రైతులు, ఆ తర్వాత వర్షాలు ముఖం చాటేయడంతో దిగాలు చెందుతున్నారు. తేమ లేక విత్తనాలు మొలకెత్తక మళ్లీ విత్తనాలు వేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**దిగుబడిపై ప్రభావం :** వర్షాలు పడకపోవడం వల్ల భూమి దున్నడానికి కూడా వీలు లేకుండా గట్టిపడిపోతోంది. జూలై మధ్య వరకు ఇదే పరిస్థితి కొనసాగితే పంట దిగుబడులు భారీగా పడిపోయే ప్రమాదం ఉంది. ఖరీఫ్ సీజన్ లో వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు ఎలా దెబ్బతింటాయో మరియు ఎలా ఎదుర్కోవాలో చూసేందుకు

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల్లో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ, పంట పొలాలు దున్నుకోవడానికి, విత్తనాలు వేసుకోవడానికి తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో అన్నదాతలు ఆకాశం వైపు చూస్తూ ఎదురుచూస్తున్నారు.

## వ్యవసాయంలో వర్షాల ప్రభావం

ఖరీఫ్ పనులకు ఆటంకం: వరి, పత్తి, మొక్కజొన్న వంటి ప్రధాన పంటల సాగుకు భూములను సిద్ధం చేసినా, సరైన "పదును" (తేమ) లేకపోవడంతో విత్తనాలు వేయలేకపోతున్నారు.

## ప్రత్యామ్నాయ ఆలోచనలు

వర్షాధార ప్రాంతాల్లో రైతులు ఆందోళన చెందవద్దని, జూలై మధ్య వరకు పత్తి, మొక్కజొన్న లాంటి పంటలు వేసుకోవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

## పెరిగిన పెట్టుబడులు

వర్షాలు ఆలస్యం కావడం వల్ల డీజిల్, ఎరువుల ధరలు పెరిగి రైతులకు అదనపు ఆర్థిక భారం పడుతోంది. వర్షం కోసం ప్రార్థనలు, ఆచారాలు గ్రామీణ ప్రాంతాల్లో వరుణ దేవుని అనుగ్రహం కోసం రైతులు, మహిళలు ప్రత్యేక పూజలు, భజనలు మరియు సంప్రదాయ పూజలు చేస్తూ మొక్కుకుంటున్నారు..

# రుమలకు పోటెత్తిన భక్తులు... నిన్న శ్రీవారి హుండీకి భారీ ఆదాయం

**తిరుమల శ్రీవారికి నిన్న రూ.5.63 కోట్ల హుండీ ఆదాయం**

**స్వామివారిని దర్శించుకున్న 95,498 మంది భక్తులు**

**సర్వదర్శనానికి సుమారు 10 నుంచి 12 గంటల సమయం**

**21 కంపార్ట్‌మెంట్లలో దర్శనం కోసం వేచి ఉన్న యాత్రికులు**

**నిన్న ఒక్కరోజే 4.34 లక్షల లడ్డూల విక్రయం**



తిరుమల శ్రీవారికి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా భారీ ఆదాయం లభించింది. సోమవారం ఒక్కరోజే శ్రీవారి హుండీకి రూ.5.63 కోట్ల ఆదాయం వచ్చినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. నిన్న శ్రీవారిని మొత్తం 95,498 మంది భక్తులు దర్శించుకున్నారు. తిరుమల గిరులపై భక్తుల రద్దీ కొనసాగుతోంది. ప్రస్తుతం 21 కంపార్ట్‌మెంట్లలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. టైమ్‌స్లాట్ టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు శ్రీవారి దర్శనానికి సుమారు 10 నుంచి 12 గంటల సమయం పడుతుందని టీటీడీ తెలిపింది. వారాంతం ముగిసినా రద్దీ తగ్గకపోవడంతో కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. సోమవారం నాడు 30,231 మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించుకున్నారు. టీటీడీ నిన్న మొత్తం 4.34 లక్షల లడ్డూ ప్రసాదాలను విక్రయించింది. అదేవిధంగా, 2.58 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదం అందించగా, 3,172 మందికి వైద్య సేవలు అందజేశారు.

# ఏరువాక పౌర్ణమి నువ్వా నేనా పరుగు పందెం పోటీలు

- కమ్మళదిన్నె బోయ హనుమంతు మొదటి విజేత
- లాంగ్ జంప్ విజేత పింజరి బాబు
- గెలుపొందిన యువకులకు టీడీపీ రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి బహుమతులు ప్రధానం
- గ్రామ టీడీపీ నాయకులు









**పెద్దకడబూరు జూన్ 30,ప్రభ మనం:** మండల పరిధిలోని కమ్మలుదిన్నె గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా గ్రామంలో మంగళవారం నిర్వహించిన 6 కిలోమీటర్ల పరుగు పందెంను నిర్వహించారు.ఈ పరుగు పందెం పోటీలలో 27 మంది యువకులు పాల్గొన్నారు.పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచిన బోయ హనుమంతు 10.000-అలాగే లాంగ్ జంప్ నందు మొదటి స్థానంలో ఉన్న పింజరి బాబు అనే వ్యక్తి కి 5000-వీరిద్దరికీ కమ్మళదిన్నె గ్రామ నాయకులు బోయ నాగేంద్ర తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి గారు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి సంవత్సరం మాదిరి ఈ సంవత్సరం కూడా ఎరువాకా పౌర్ణమి కి అన్ని కులాలు ప్రజలు ఐక్యమంత్యంతో ఎటువంటి గాలాటాలు లేకుండా జరుపుకోవడం చాలా సంతోషాదాయకం ఇలాంటి సంతోషకరమైన కార్యక్రమాలు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటున్నాను.

ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మీసేవ ఆంజనేయులు బిసి సాధికారిక సమితి సభ్యులు మల్లికార్జున డీలర్ శంకర్,భీమేష్,తాయన్న, నాగరాజు,పోలీస్ సిబ్బంది నీటి సంఘం అధ్యక్షులు చిన్న నాగన్న,

జె ఎఫ్ సి ఎస్ చైర్మన్ ప్రభాకర్,మాజీ ఎంపిటిసి గోవిందు, పుల్లయ్య,అధిక సంఖ్యలో గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు

## ఎద్దుల బండలాగుడు పోటిలను ప్రారంభించిన టీడీపీ నాయకులు పన్నగ వెంకటేష్ స్వామి







**మంత్రాలయం , జూన్ ,30, మనం న్యూస్ :-** ఏరువాక పౌర్ణమి పండుగ సందర్భంగా మంత్రాలయంలోని సంతమార్కెట్ లో గ్రామ స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలను మంత్రాలయం టీడీపీ మండల కన్వీనర్ పన్నగా వెంకటేష్ , పూజారి వ్యాసరాజస్వామి , ఎంపిటిసి బోయ వెంకటేష్ , పట్టణ అధ్యక్షుడు వరదరాజు , వైసీపీ యువ నాయకులు బొంబాయి శివ తో కలిసి మంగళవారం పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పన్నగా స్వామి మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి సందర్భంగా మంత్రాలయం లో ప్రతిఏటా ఎద్దుల బండలాగుడు పోటిలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు బండలాగుడు పోటిల ఆర్గనైజర్ సున్నం రామకృష్ణ టీడీపీ నాయకులు పన్నగా వెంకటేష్ స్వామి , పూజారి వ్యాసరాజస్వామి , ఎంపిటిసి బోయ వెంకటేష్ , పట్టణ అధ్యక్షుడు వరదరాజు వైసీపీ నాయకులు బొంబాయి శివ కు శాలువా కప్పి , పూలమాలలు వేసి సన్మానించారు. ఈ పోటీ లకు 9 జతల ఎద్దులు పాల్గన్నాయని ఆర్గనైజర్ తెలిపారు. అనంతరం బండలాగుడు పోటీల్లో మంత్రాలయం గ్రామానికి చెందిన రైతు ఇమ్మానీయల్ ఎద్దుల మొదటి విజేతగా నిలిచింది. రెండు వ విజేతగా గుండ్రాయి భీమ ,మూడవ విజేతగా వనికి రాముడు ఎద్దులు నిలిచాయి. విజేతలకు టీడీపీ మండల కన్వీనర్ పన్నగా వెంకటేష్ స్వామి మొదటి విజేతకు రూ. 20000,రెండవ విజేతగా రూ. 15000 ,మూడవ విజేతకు రూ. 10000 నగదు ను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిన్న భీమ ,వట్టెప్ప నరసింహ ,చిన్న సుంకప్ప , గనెకంటి గురురాజ్ , ఏబు , వనికి గురురాజ్ , మంచాల సొసైటీ డైరెక్టర్ డిసి తిమ్మాప్ప , గ్రామ రైతులు తదితరులు ఉన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం



**మంత్రాలయం , జూన్ ,30 మనం న్యూస్ ;-** నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం రాఘవేంద్రపురం కాలనీకి చెందిన కరెంటు సుంకప్ప అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. ఈ విషయం మంత్రాలయం టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి దృష్టికి ఎంపిటిసి బోయ వెంకటేష్ తీసుకువెళ్ళారు. ఆయన ఆదేశాలు మేరకు ఎంపిటిసి బోయ వెంకటేష్ మృతిన్ని ఇంటికి వెళ్లి సుంకప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి , కుటుంబ సభ్యులను ఓదార్చి అంత్యక్రియలకు రూ. 5 వేలు నగదు అందించారు. వారి పాటు టీడీపీ నాయకులు మద్రి శివకుమార్ , మిడిగలదిన్నె రఘు , కార్యకర్తలు సుంకప్ప మృతదేహానికి నివాళులర్పించారు.

## అట్టహాసంగా ఏరువాక పౌర్ణమి సంబరాలు

### పచ్చని పంటల కోసం గ్రామ గ్రామాన రైతన్నలు ప్రత్యేక పూజలు









**పెద్దకడబూరు జూన్ 30,ప్రభ మనం:** పెద్దకడబూరు మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఏరువాక పౌర్ణమి వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి.మండల పరిధిలోని హనుమాపురం,హెచ్ మురవణి, పెద్దకడబూరు, కంబళదిన్నె, జాలవాడి, కల్లుకుంట,చిన్నతుంబళం, బసలదొడ్డి, చిన్నకడబూరు గ్రామాలలోని రైతులు వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు.పచ్చని పంటల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగు రైతు సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఏరువాక పండుగ సందర్భంగా ఎద్దులకు ప్రత్యేక పూజలు నిర్వహించి,వ్యవసాయ పనులకు శుభారంభం చేశారు.మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని రైతులు భగవతుడిని కోరుకున్నారు.మండల వ్యవసాయ అధికారిణి సుచరిత రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, నాణ్యమైన విత్తనాల వినియోగం,పంటల సంరక్షణపై అవగాహన కల్పించారు. వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని పేర్కొంటూ, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఏరువాక పండుగ గ్రామీణ సంప్రదాయాలకు అద్దం పట్టేలా, రైతుల్లో నూతనోత్సాహాన్ని నింపేలా వైభవంగా సాగింది. హనుమాపురం, పెద్దకడబూరు గ్రామాలలో ఏరువాక పండుగను పురస్కరించుకుని యువత పరుగు పందెంలో పాల్గొన్నారు. హనుమాపురంలో పరుగు పందెంలో మహేంద్ర విజేతగా నిలిచారు.మహేంద్రను టీడీపీ నాయకులు బీపీ ఈరన్న, రాజశేఖర్ పూలమాలలు వేసి సత్కరించారు. పెద్దకడబూరులో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పరుగు పందెంలో రమేష్, లాంగ్ జంప్ లో మల్లికార్జున విజేతలుగా నిలిచారు. విజేతలను టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మొట్రు రామాంజనేయులు పూలమాలలు వేసి అభినందించారు.అలాగే కురువ సంఘం ఆధ్వర్యంలో జరిగిన పరుగు పందెంలో మల్లికార్జున, లాంగ్ జంప్ లో జగన్ విజేతలుగా నిలిచారు. చిన్నకడబూరు గ్రామంలో నిర్వహించిన పరుగు పందెంలో నాగయ్యగారి బాలరాజు విజేతగా నిలిచారు. బాలరాజును టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ గోనుమాను నరసన్న పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.ఆయా గ్రామాలలో పరుగు పందెంలో విజేతలుగా నిలిచిన యువకులను గ్రామ పురవీధుల గుండా ఊరేగించి అభినందించారు.ఏరువాక పండుగను పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మారుతి ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

ప్రభ మనం TELUGU DAILY RNI/APTEL/26/A3829 Gmail: prabhamanam@gmail.com



# ఘనంగా కుమ్మరి సుంకన్న, బోయ వెంకట్రాముడు ల వర్ధంతి వేడుకలు

## తుగ్గలి అభివృద్ధికి గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగేంద్ర హామీలు

## మహిళలకు 1500 చీరలు పంపిణీ

**తుగ్గలి జూన్ 30 ప్రభ మనం న్యూస్:** మండల కేంద్రమైన తుగ్గలిలో కుమ్మరి సుంకన్న,బోయ వెంకట రాముడు ల 37వ వర్ధంతి వేడుకలను తుగ్గలి నాగేంద్ర, వల్లే గోపాల్ కుటుంబ సభ్యులు మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ వర్ధంతి వేడుకలలో ముందుగా కుమ్మరి సుంకన్న,బోయ వెంకట రాముడు ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుంకన్న, వెంకట్రాముడుల సమాధి వద్దకు వెళ్లి వారి సమాదికి పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టి నైవేద్యం సమర్పించి నివాళు లు అర్పించారు.అనంతరం నిర్వహించిన వర్ధంతి వేడుకలలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కుమ్మరి సుంకన్న మరియు బోయ వెంకట రాముడల సేవలను గురించి స్మరించుకున్నారు. అనంతరం గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి తుగ్గలి గ్రామంలో తన తండ్రి కుమ్మరి సుంకన్న,బోయ వెంకట రాముడు ల వర్ధంతి వేడుకలను రెండు కుటుంబాలు కలిసి నిర్వహిస్తున్నామని తెలియ జేశారు.ఈ వర్ధంతి వేడుక లలో భాగంగా తుగ్గలి గ్రామ అభివృద్ధి కొరకు నాగేంద్ర పలు హామీలను ఇచ్చారు. గ్రామం కోసం చేసిన అభివృద్ధి లో భాగంగా చేసిన పనులను వివరించారు.గ్రామంలో బి.సి కసలనీలో చాలావరకు సిసి రోడ్డులను వేశామని, అదేవిధంగా13 లక్షల సొంత నిధులతో సీతారాములకు రథోత్సవాన్ని చేయించానని, గ్రామంలోని ఎంతోమంది నిరుద్యోగ యువకులకు జియో మైసూర్ గోల్డ్ మైన్స్ నందు ఉద్యోగ అవకాశాలను కల్పించానని ఆయన తెలియజేశారు.అలాగే బీసీ కాలనీకు మరియు వరి మడిలో కొలువై ఉన్న శివాలయంకు, పెట్రోలు బంకు పక్కన కాలనీకు తప్పకుండా సీసీ రోడ్డులను వేస్తామని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు.కోటి 60 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం కొరకు త్వరలో మంజూరు అవుతుందని ఆయన తెలియజేశారు.అలాగే గోల్డ్ మైన్స్ ప్రారంభానికి విచ్చేసిన ముఖ్యమంత్రితో స్థానిక ఎమ్మెల్యే మంత్రులతో కలసి నియోజకవర్గ అభివృద్ధి కొరకు,నూతన పింఛన్ల కొరకు,ఆడబిడ్డ నిధి తదితర వంటి



విషయాలపై చర్చించామని ఆయన తెలియజేశారు.త్వరలో ఇచ్చిన హామీలను అన్నిటిని కూటమి ప్రభుత్వం నెర వేరుస్తుందని ఆయన తెలియజేశారు.అదేవిధంగా ప్రజలకు పంపిణీ చేసిన ప్లాట్ల నందు ప్రభుత్వ అనుమతు లతో ఇంటి నిర్మాణాలను చేపట్టి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను ఆహ్వానించి ముఖ్యమంత్రి చేతులు మీదుగా గృహాలను ప్రారంభిస్తానని ఆయన తెలియజేశారు.అదే సంకల్పంతో ఊరి వాకిలిని కూడా నిర్మిస్తానని ఆయన ప్రజలకు హామీలు ఇచ్చారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి వర్ధంతి వేడుకల సందర్భంగా గ్రామంలోని మహిళలకు నాణ్యమైన చీరలు పంపిణీ చేస్తామన్నారు.ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పత్తికొండ శాసనసభ్యులు కేఈ శాంబాబు చొరవతో తుగ్గలి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఆయన ప్రజలకు తెలియజేశారు.ఈ వర్ధంతి కార్యక్రమానికి విచ్చేసిన వారి కొరకు భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు.అనంతరం రెండు కుటుంబాల ఆధ్వర్యంలో గ్రామ మహిళలకు చీరలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కుమ్మరి సుంకన్న సతీమణి వెంకట నరసమ్మ,మాజీ జడ్పిటిసి వరలక్ష్మి,తుగ్గలి యువ నాయకుడు మణికంఠ, తుగ్గలి వల్లే గోపాల్, మాజీ ఎంపీటీసీ వల్లే వెంకటేష్,వల్లే చిన్న వెంకటేష్,వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, కురవ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప,పత్తికొండ ఎమ్మెల్యే పిఏ నరసింహ చౌదరి,రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు వెంకటపతి,ఎస్సీ సెల్







రాష్ట్ర ఉపాధ్యక్షులు చందోలి తిరుపాల్,బిసి సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి ఆస్పరి శ్రీనివాసులు, ఉప్పర్లపల్లె సొసైటీ అధ్యక్షులు అప్పా వేణు,కేశవరెడ్డి,తుగ్గలి అల్లా బకాష్,సోమ్లా నాయక్, ఎర్రగుడి వెంకటస్వామి, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్,తిమ్మయ్య చౌదరి, మాజీ ఎంపీపీ కొమ్ము వెంకటేష్,కుమ్మరి సుంకన్న కుటుంబ సభ్యులు వరప్ప,భాస్కర్,పత్తికొండ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ తుగ్గలి రంగా,మాజీ సర్పంచ్లు రామాంజనేయులు,రవి, కుమ్మరి సుంకన్న,బోయ వెంకట రాముడు ల కుటుంబ సభ్యులు,మండల తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ బి ఎన్ ఫౌండేషన్ వైస్ చెర్మన్ గా హరిత రెడ్డి కి భాద్యతలు



**కడప బ్యూరో జూన్ :30,ప్రభ మనం:** కడప పట్టణంలోని ఓల్డ్ బైపాస్ రోడ్డులో ఉన్న ఆర్ బి ఎన్ ఫౌండేషన్ ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్ బి ఎన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చైర్మన్ పాపిరెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్ బి ఎన్ ఫౌండేషన్ వైస్ చెర్మన్ గా హరిత రెడ్డి ని నీయమిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా సేవ చేసే భాద్యతల్ని కల్పిస్తున్నామని మిషన్ ఎద్యుకేషన్ ప్రాజెక్ట్ ద్వారా అర్హులకు నాణ్యమైన విద్య అందించాలని సంస్థ పెట్టిన బాధ్యతలను నిర్వర్తించాలని మండల జిల్లా,రాష్ట్ర,జాతీయ స్థాయిలో పురోగతిని సాదించాలని ఫౌండేషన్ విస్తరణ కోసం తన వంతు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆమెను కోరారు. సంస్థ యొక్క ఆశయాలు,సిద్ధాంతాల కోసం నిరంతరం కష్టపడి పనిచేయాలని,స్వచ్ఛందంగా వాలంటీర్లను నియమించాలని ఆయన పిలుపునిచ్చారు.సంస్థకు సహాయపడే వారిని తమ జీవన విధానంలో ప్రధానంగా పెట్టుకొని సమాజం కోసం సంస్థను ప్రచారం చేస్తూ ప్రజల్లోకి తీసుకొని వెళ్లి తద్వారా సమాజంలో మార్పు తీసుకురావాలని కోరారు.

## నిజాయితీ చాటుకున్న కుదె మారెప్ప

దొరికిన బంగారం పోలీసులకు అప్పగించిన కుదే మారెప్ప

చాకలి మధుకి తమ సొమ్మును అప్పగించిన ఎస్ఐ మారుతి



**పెద్దకడబూరు జూన్ 30,ప్రభ మనం:** పెద్దకడబూరు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన కుదె మారెప్ప ం/శీ తిమ్మప్ప,( వికలాంగుడు) ఎస్సీ సోమవారం ఉదయం 11: 00గంటలకు తన మోటార్ సైకిల్ మీద బ్యాంక్ పని నిమిత్తం వెళ్తుండగా మార్గమధ్యంలో ఒక పర్సు దొరికినది, ఆ పర్సులో చూడగా అందులో రెండున్నర తులం బంగారం (ఒక నెక్లెస్,రెండు కమ్మలు, మావిటీలు) మరియు 1300 రూపాయలు నగదు చూసుకొని అతను ఎవరో పోగొట్టుకున్నారని తెలుసుకొని మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ కు వచ్చి బంగారు నగలు,1300 నగదు అప్పజెప్పి తన నిజాయితీని చూపించాడు. బంగారు నగలు,నగదు గురించి విచారణ చేయగా పోగొట్టుకున్న చాకలి మధు, పెద్దకడుబూరు నివాసిగా గుర్తించి,వారిని కూడా పోలీస్ స్టేషన్ పిలిపించి వారిని నిజా నిజాలు విచారణ చేసుకొని,పోగొట్టుకున్న బంగారు నగలు,నగదు అప్పజెప్పడమైనది మరియు నిజాయితీ చాటుకున్న కుదె మారెప్పను ఎస్ ఐ మారుతి తమను ప్రత్యేకంగా సన్మానించడం జరిగిందని తెలిపారు.

## పరుగు పందెం విజేతలకు నగుదు పురస్కారం



**మంత్రాలయం, జూన్ 30,(మనం న్యూస్) :** మండల పరిధిలోని చెట్నెహళ్ళి గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా పరుగు పందెంలో గెలుపొందిన విజేతలకు మంగళవారం మంచాల సొసైటీ డైరెక్టర్ చాపల నాగేష్ నగుదు బహుమతి అందజేసి సత్కరించారు. పరుగు పందెంలో మొదటి విజేత చాకలి హనుమంతు కుమారుడు శివకు రూ. 3 వేలు, రెండవ విజేత బోయ నాగేంద్ర కుమారుడు హనుమంతు కు రూ. 2 వేల నగుదు బహుమతిగా అందజేశారు.

## రైతుల సమస్యలను పట్టించుకోని సీఎం పర్యటన: భాస్కర్ రెడ్డి



**తుగ్గలి, జూన్ 30 ( ప్రభ మనం న్యూస్ ):** పగిడిరాయిలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా రైతుల సమస్యలపై ఎలాంటి హామీ ఇవ్వలేదని సీపీఎం సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఈశ్వరరెడ్డి తనయుడు ఎర్రగుడి భాస్కర్ రెడ్డి విమర్శించారు. మంగళవారం ఎర్రగుడిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బంగారు నిక్షేపాల వల్ల కంపెనీలకు లాభాలు చేకూరుతున్నాయని, భూములు కోల్పోయిన రైతులకు మాత్రం న్యాయం జరగడం లేదని అన్నారు. రైతుల ఆత్మహత్యలు, వలసలను అరికట్టేందుకు రుణమాఫీ చేయాలని, రైతు సంక్షేమ పథకాల నిధులను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, రంగారెడ్డి, కొండారెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## తుగ్గలిలో ముగిసిన పల్స్ పోలియో కార్యక్రమం



**తుగ్గలి, జూన్ 30( ప్రభ మనం న్యూస్ ):**-మండలంలోని తుగ్గలి, పగిడిరాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఆదివారం పోలియో కేంద్రాల వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేయగా, మిగిలిపోయిన చిన్నారులకు సోమ, మంగళవారాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమాన్ని వైద్యాధికారులు డాక్టర్ కిరణ్, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ భాష, డాక్టర్ రోజారమణి, డాక్టర్ ప్రవీణ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓలు బండయ్య, వెంకటరమణయ్య, పీహెచ్ఎన్లు రామక్క, సరస్వతి, సూపర్వైజర్ నాగమ్మతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రాంపల్లిలో రాతి దూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా



**తుగ్గలి జూన్ 30 ( ప్రభ మనం న్యూస్):** మండల పరిధిలోని రాంపల్లి గ్రామంలో కాశిరెడ్డి నాయన స్వామి 21వ ఆరాధన ఉత్సవాల సందర్భంగా మంగళవారం రాతి దూలం లాగుడు పోటీలు ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ పోటీలను మొదటి బహుమతి దాత ఏకాశి జయన్న ప్రారంభించారు. అనంతరం విజేతలైన యజమానులకు నగదు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతిగా రూ.40 వేలు, రెండవ బహుమతిగా రూ.30 వేలు, మూడవ బహుమతిగా రూ.20 వేలు, నాలుగవ బహుమతిగా రూ.15 వేలు, ఐదవ బహుమతిగా రూ.10 వేలు, ఆరవ బహుమతిగా రూ.5 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ తిరుపాల్ నాయుడు, మారెళ్ల సొసైటీ డైరెక్టర్ రాంపల్లి శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్ ఏమాద్రి నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న డాన్స్ మాస్టర్ తుగ్గలి హరి



**తుగ్గలి జూన్ 30 ప్రభ మనం న్యూస్:** మండల పరిధిలోని రాంపల్లి లో శ్రీ శ్రీ కాసిరెడ్డి నాయన ఆరాదనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.ఈ ఆరాదనోత్సవాలను తిలకించదానికి పరిసర గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ ఆరాదనోత్సవాలను తిలకించదానికి వచ్చిన ఓ భక్తురాలు ఒకటిన్నర తులం ఉన్న బంగారు చైన్ ను జరవిడుచుకుంది.అది కాస్త రాంపల్లిలో ఆటో తొలుతూ జీవనం సాగిస్తున్న తుగ్గలి నాగేష్ కుమారుడు డాన్స్ మాస్టర్ హరి కంటపడడంతో దానిని తీసుకుని పోగొట్టుకున్న వారికి ఆలయ కమిటీ,గ్రామ పెద్దల సమక్షం లో సురక్షితంగా అందచేశారు. డాన్స్ మాస్టర్ తుగ్గలి హరి నిజాయితీని గ్రామస్తులు, భక్తులు అభినందించారు.

## ప్రమాదకరంగా మారిన పాఠశాల గోడలు

ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు





**తుగ్గలి జూన్ 30 ప్రభ మనం న్యూస్:** మండల కేంద్రమైన తుగ్గలి ప్రాథమిక పాఠశాల గోడ తీవ్ర శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారుతోంది పాఠశాల గోడల మధ్యలో బసిరి చెట్లు, పిచ్చి మొక్కలు మొలిచి గోడ పూర్తిగా చీలిపోయినట్లు స్పష్టంగా కనిపిస్తున్నా విద్యా శాఖ అధికారులకు అది కనిపించక పోవడం మన దౌర్భాగ్యం.గోడ పగుళ్ల వల్ల స్కూల్ గోడ బలహీనపడి,ఎప్పుడు కూలుతుందో తెలియని స్థితికి చేరిందని ప్రజలు వాపోతున్నారు. మొక్కలు పెద్దవి అవుతున్న కొద్దీ గోడల మధ్య పగుళ్లు మరింత తీవ్రమవుతున్నా పట్టించుకునే ఆదికారే లేకపోవడం సిగ్గుచేటు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు చిన్నపిల్లలు కావడం,వారు ఆడుకునే సమయంలో ఈ గోడకు సమీపంలోకి వెళ్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చెందుతున్నారు.ఈ పాఠశాలకు తక్షణ చర్యలు అవసరం అని పాఠశాల ఆవరణలో ఇలాంటి శిథిలావస్థకు చేరిన గోడలు ఉండటం విద్యార్థుల ప్రాణాలకు ముప్పుగా మరే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.కాబట్టి, విద్యాశాఖ అధికారులు మరియు స్థానిక ప్రజాప్రతి నిధులు తక్షణమే స్పందించి, ఆ చెట్లను తొలగించి, ప్రమాదకరంగా మారిన ఆ గోడకు తగిన మరమ్మతులు చేపట్టాలని లేదా గోడను నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు కోరుతున్నారు.

## విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్ అవార్డు

❖ఎస్.దీపికను ప్రత్యేకంగా అభినందించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

❖విద్యార్థినికి గవర్నమెంట్ తరుపున సహాయ సహకారాలు కచ్చితంగా అందిస్తాం

❖విద్యార్థినికి అవార్డు రావడంతో చిన్న తుంబలం టిడిపి సీనియర్ నాయకులు వీరేష్ గౌడ్ దంపతులు హర్షం వ్యక్తం



**పెద్దకడబూరు జూన్ 30,ప్రభ మనం:** మండల పరిధిలోని చిన్న తుంబలం గ్రామానికి చెందిన ఎస్.దీపిక ఏపీ ఆర్ జె సి బాలికల కళాశాల బనవాసి నందు ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూప్ లో 988 మార్క్ లు స్టేట్ లెవెల్ లో రావడంతో విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్ అవార్డు తో పాటుగా లాప్టాప్ తీసుకోవడం జరిగిందని గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు వీరేష్ గౌడ్ దంపతులు మంగళవారం విలేకరులకు ఈ విద్యార్థికి ఉన్నత విద్యా చదువుకోవడానికి గవర్నమెంట్ తరపున సహాయ సాకారం కారాలు అందిస్తానని నారా లోకేష్ చెప్పడం జరిగింది.దీనికి దీపిక తల్లిదండ్రులు తండ్రి ఎస్.వీరేష్ గౌడ్,తల్లి సునీతమ్మ ఆనందం వ్యక్తం పరిచారు.గ్రామ ప్రజలు కూడ ఎస్.దీపిక కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారని వారన్నారు.

Office adress....EDITED & PUBLISHED AND OWNED BY.EDITOR : V.LINGAMURTHY. PUBLISHED AT : VSAR PUBLICATION VSAR PUBLICATIONS91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL, ANDHRA PRADESH - 518006CONTACT NO :9000367833.RNI,APTEL/26/A 3829,E-MAIL.ID prabhamanam@gmail.com